పల్లంట్ల మిర్చి .. రేటు మరీ ఘాటు

- కిలో మిర్చి రూ.900
- తుపాను ఎఫెక్ట్‌తో దెబ్బతిన్న తోటలు
- గణనీయంగా తగ్గిన దిగుబడులు
- 200 ఎకరాల్లో మిర్చి సాగు



దేవరపల్లి మండలం పల్లంట్లలో తుపానుకు దెబ్బతిన్న మిరప తోట



దేవరపల్లి మండలం పల్లంట్ల కళ్లంలో ఎండు మిర్చి

దేవరపల్లి: దేశవాళీ ఎండుమిర్చి రేటు చుక్కలను అంటుతోంది. ఎండుమిర్చి కొనాలంటేనే వినియోగదారులు భయపడుతున్నారు. దిగుబడులు గణనీయంగా తగ్గడంతో ఈ ఏడాది ఎండుమిరపకు ఎన్నడూ లేనంతో డిమాండ్ ఏర్పడింది. వంటకాల్లో దేశవాళీ ఎండు మిర్చి వాడేందుకే మహిళలు మొగ్గు చూపుతారు. ఈ రకం కారం ఏడాది పొడవునా నిల్వ ఉండడంతో పాటు ఘాటు తక్కువ. ఆవకాయ, మాగాయి వంటి నిల్వ పచ్చళ్లకు దేశవాళీ ఎండి మిర్చే వాడతారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని దేవరపల్లి, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లో ఎక్కువగా ఈ రకం మిర్చి పండిస్తారు. మార్చి, ఏప్రిల్, మే నెలలు ఎండు మిర్చి సీజన్. ఈ సీజన్‌లో వినియోదారులు ఆయా ప్రాంతాలకు వెళ్లి నాణ్యతను చూసి, తమ అవసరం మేరకు ఎండు మిర్చి కొనుగోలు చేస్తారు. మిచాంగ్ తుపాన్ వల్ల కురిసిన అధిక వర్షాలకు ఈ ఏడాది మిరపతోటలు బాగా దెబ్బతిన్నాయి. పైగా తెగుళ్లు సోకాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా తోటలు తేరుకోలేదు. ఫలితంగా దిగుబడులు తగ్గిపోయాయని రైతులు తెలిపారు.

పల్లంట్ల మిర్చి స్పెషల్

దేవరపల్లి మండలం పల్లంట్లలో పండించే ఎండు మిర్చి అంటే వినియోగదారులు మక్కువ చూపుతారు. ధర కాస్త ఎక్కువైనప్పటికీ ఏటా ఇక్కడి కాయలనే కొనుగోలు చేస్తారు. వేసవి మూడు నెలలూ పల్లంట్లలో వినియోదారుల సందడి ఎక్కువ. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల మహిళలు ఆటోలు, కార్లలో పల్లంట్ల వచ్చి కళ్లాల్లోనే తమకు నచ్చిన ఎండుమిర్చిని కొనుగోలు చేస్తారు. దూర ప్రాంతాల్లోని బంధువులు, మిత్రులకు ఇక్కడి ఎండు మిర్చిని పంపుతారు. జంట గ్రామాలుగా పిలిచే పల్లంట్ల, కురుకూరుల్లో ఎండు మిర్చి సాగు ఎక్కువ. రెండు గ్రామాల్లో సుమారు 200 ఎకరాల్లో దేశవాళీ రకం మిర్చి సాగు చేశారు.

గుంటూరు మిర్చి వైపు మొగ్గు

దేశవాళీ ఎండు మిర్చి ధర అందుబాటులో లేకపోవడంతో గుంటూరు, తెలంగాణలోని భద్రాచలం, అశ్వారావుపేట, కొత్తగూడెం జిల్లాల్లో పండించిన సన్న రకాల కాయల కొనుగోలుకు వినియోగదారులు మొగ్గు చూపుతున్నారు. వ్యాపారులు అక్కడి కాయలను గ్రామాలకు తీసుకొచ్చి తక్కువ రేటుకు విక్రయిస్తున్నారు. వాటి రేటు కిలో రూ.200 నుంచి రూ.250 ధర పలుకుతోంది. ధర అందుబాటులో ఉండడంతో ఎక్కువ మంది వినియోగదారులు వాటినే కొనుగోలు చేస్తున్నారు. జి–4 రకం మిర్చిని ఆయా ప్రాంతాల్లో సాగు చేస్తారు. ఈ రకం కాయలు ఘాటు ఎక్కువగా ఉండి, కారం ఎక్కువ రోజులు నిల్వ ఉండదు.

తోటలకు తుపాను దెబ్బ

మిచాంగ్ తుపాన్ తాకిడికి ఈ ఏడాది మిరప తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దిగుబడులు పడిపోవడంతో పండిన కొద్దిపాటి కాయలకూ ఎన్నడూ లేని గిరాకీ ఏర్పడింది. కిలో ఎండు మిర్చి రూ.900 ధర పలుకుతోంది. వీసెడు కాయలు(1,400 గ్రాములు) రూ.1,400 నుంచి రూ.1,500 రేటు పలుకుతోంది. గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో వీసెడు కాయలు ధర రూ.900 ఉండగా, మే, జూన్ నెలల్లో రూ.300కు తగ్గింది. ప్రస్తుతం ధరను చూసి వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు.

గతేడాది ఎండుమిర్చి దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతో రైతులకు ఎకరాకు రూ.2.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకూ ఆదాయం వచ్చింది. దాంతో ఈ ఏడాది రైతులు అధిక కౌలుకు భూములు తీసుకుని మిరప వేశారు. ఎకరం కౌలు రూ.50 వేలు కాగా, పెట్టుబడి రూ.1 లక్ష వరకూ అయ్యింది. తోటలు పూత, కాయదశలో ఉండగా తుపాను పగ బట్టిందని రైతులు తెలిపారు.

పెట్టుబడులు కూడా రాలేదు



‘ఈ ఏడాది నాలుగు ఎకరాల్లో మిరప తోట వేశాను. ఎకరాకు రూ.1 లక్ష చొప్పున పెట్టుబడి పెట్టాను. తోటలు పూత, పిందెలతో ఆశాజనకంగా ఉన్నాయి. నవంబరులో వచ్చిన మిచాంగ్ తుపాను వల్ల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు తోటలు దెబ్బతిన్నాయి. ఎన్ని మందులు కొట్టినా తేరుకోలేదు. తుపాను అనంతరం మిగిలిన కాయలను ఒబ్బిడి చేసి అమ్ముతున్నాను.ఎకరాకు రూ.50 వేల ఆదాయం వస్తోంది. సుమారు రూ.2 లక్షల నష్టం వస్తోంది. 20 ఏళ్లుగా మిరప సాగు చేస్తున్నాను. ఎప్పుడూ ఈ విధంగా తోటలు దెబ్బ తినలేదు. కాయలు లేక గిరాకీ ఏర్పడింది.’

– పిచ్చుకల వెంకటేశ్వరరావు, రైతు, పల్లంట్ల

క్లుప్తంగా

వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు



విశేష అలంకరణలో బ్రాహ్మణగూడెంలోని వీరబ్రహ్మేంద్రస్వామి వారు

చాగల్లు: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహోత్సవాల్లో భాగంగా శనివారం బ్రాహ్మణగూడెంలోని స్వామి వారిని ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. పూజలు,అభిషేకాలు చేశారు. వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి విశేష పూజలు, భజనలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

చల్లంగా చూడమ్మ.. సోమాలమ్మా



సోమాలమ్మకు నూరు కలశాలతో జలాభిషేకం చేస్తున్న భక్తులు

నల్లజర్ల: చల్లంగా చూడమ్మా అని ప్రార్థిస్తూ నల్లజర్ల గ్రామ దేవత సోమాలమ్మ వారికి శత కలశాలతో భక్తులు శనివారం జలాభిషేకం నిర్వహించారు. గ్రామం సుభిక్షింగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని, పాడిపంటలు సమృద్ధిగా లభించాలని కోరుతూ వారీ ఈ వేడుక జరిపారు. ఈ సందర్భంగా అమ్మ వారికి విశేష అలంకారం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మ వారికి పూజలు

చాగల్లు: స్థానికంగా కొలువైన మహాలక్ష్మమ్మ వారి వార్షిక మహోత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుడు జి. సుబ్రహ్మణ్య శర్మ, పండిత పురోహితుల వేద మంత్రాల మధ్య అమ్మవారి మహోత్సవానికి కలశ స్థాపన, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, సమస్త దేవత ఆవాహన కుంకుమార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భజన కాలక్షేపం జరిగింది. ఆదివారం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

రేషన్ పంపిణీని 96 శాతానికి పెంచాలి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ సప్లయిస్ డీటీ సత్యనారాయణ

నల్లజర్ల: పౌర పంపిణీ వ్యవస్థ ద్వారా గత నెలలో కేవలం 92 శాతం రేషన్ పంపిణీ మాత్రమే జరిగిందని, దానిని 96 శాతానికి పెంచాలని పౌర సరఫరాల విభాగం డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ డీలర్లకు సూచించారు. పౌర సరఫరాల పంపిణీ డీలర్లు, ఎండీయూలతో శనివారం సాయంత్రం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డీలర్లు సకాలంలో ప్రభుత్వానికి డీడీలు చెల్లించి ప్రజలకు నిత్యావసర సరకులను సకాలంలో అందించాలన్నారు. జూన్ 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ప్రజా పంపిణీని ప్రారంభించాలన్నారు. బియ్యం, పంచదార మాత్రమే అందుబాటులో ఉంటాయన్నారు. డీలర్లు, ఎండీయూలు అందుబాటులో ఉంటూ పరస్పరం సహకరించుకోవాలన్నారు. డీలర్ల సంఘ అధ్యక్షుడు సీమకుర్తి నరసింహమూర్తి ,డీలర్లు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహాల ఊరేగింపు



వెలగదుర్రులో సీతారాముల విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం: వెలగదుర్రు గ్రామ ఎస్సీ ఏరియా రామాలయంలో సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా శనివారం విగ్రహాలను ఘనంగా ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలను ఉంచి, వాయిద్యాలు, బాణసంచా కాల్పుల మధ్య గ్రామంలో వైభవంగా ఊరేగించారు. ఇళ్ల వద్ద భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం హోమాలు, పూజల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

10 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు

దేవరపల్లి: గోపాలపురం మండలం దొండపూడి గ్రామంలో దేవరపల్లి ఎస్ఈబీ అధికారులు శనివారం దాడి చేశారు. ఈ గ్రామంలో 10 లీటర్ల సారాతో ఒక వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు సీఐ కేవీ స్వామి తెలిపారు. అలాగే ఆరుగురు పాత ముద్దాయిలను గోపాలపురం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్టు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై పి. సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేపాల్ కరాటే పోటీలకు దేవరపల్లి విద్యార్థులు



అంతర్జాతీయ కరాటే పోటీలకు నేపాల్ వెళుతున్న దేవరపల్లి విద్యార్థులు

దేవరవపల్లి: నేపాల్‌లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ కరాటే టోర్నమెంట్‌కు దేవరపల్లి విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 22, 23, 24 తేదీల్లో నేపాల్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. దేవరపల్లి నుంచి ఏడుగురు విద్యార్థులు శనివారం నేపాల్ బయలుదేరి వెళ్లినట్టు కరాటే మాస్టారు జక్కంశెట్టి శ్రీనివాస్ తెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశానికి 30 వరకూ గడువు

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి టెన్త్ పాసైన విద్యార్థుల నుంచి తొలి విడతగా ఈ నెల 30 తేదీ లోగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ గరగా శ్రీనివాస్ తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు ఇంగ్లిషు, తెలుగు మాధ్యమాలలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. మెరుగైన విద్యా ప్రమాణాలతో బోధన ఉంటుందన్నారు. అంతే గాకుండా ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో కళాశాల విద్యార్థిని కె. లీలావతి గరిష్ఠంగా 875 మార్కులు సాధించిందని చెప్పారు. ఆసక్తి కలిగిన విద్యార్థులకు కళాశాలకు వచ్చి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

నిడదవోలు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభించినట్టు ప్రిన్సిపల్ వి.గీతాంజలి శనివారం తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ సీఈసీ, హెచ్ఈసీ, ఓఏ గ్రూపుల్లో అడ్మిషన్లు నిర్వహిస్తునట్టు ఆమె వివరించారు.

ఘనంగా వాసవీ మాత జయంతి వేడుకలు

కొవ్వూరు: వాసవీ మాత జయంతి మహోత్సవాలను శనివారం పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని వెయ్యి మామిడి పండ్లు, వివిధ రకాల పూలతో అలంకరించారు. ఉదయం పంచామృతాలతో అమ్మవారికి అభిషేకాలు చేశారు. కుంకుమ, గులాబీ పూలతో సహస్ర నామార్చన చేశారు. వాసవీ క్లబ్ చైర్మన్ కక్కిరాల సూరిబాబు, పద్మావతి దంపతుల చేతుల మీదుగా పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన జరిగింది. ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు, నాయకులు మట్టే ప్రసాద్, నాళం వీర వెంకట శ్రీనివాసరావు, తుమ్మలపల్లి నాగరమేష్, దేవత ప్రసాద్, కొల్లేపర శ్రీనివాస్, కొత్తమాసు వాసు, మద్దుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో..

తాళ్లపూడి: ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవతైన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవాల సందర్భంగా తాళ్లపూడిలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు గంగాధరస్త్రి ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. అంతకు ముందు యువకుల ఆధ్వర్యంలో అమ్మవారి పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, వాసవీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



కొవ్వూరులో వాసవీమాతను దర్శించుకుంటున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

పల్లకీ సమర్పణ

తాళ్లపూడిలోని నగరేశ్వర వాసవీ కన్యక పరమేశ్వరి జయంతి సందర్భంగా స్థానిక సొలస కుటుంబం వాసవీ మాతకు టేకు పల్లకీని సమర్పించింది. సుమారు రూ.50 వేల విలువైన ఈ పల్లకీని సొలస సతీష్, దేవి దంపతుల గృహం వద్ద నుంచి ఆర్యవైశ్య యువకులు మేళతాళాలతో వాసవీ ఆలయానికి తీసుకువచ్చారు.

చాగల్లులో..

చాగల్లు: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి అమ్మవారి కేక్ కట్ చేశారు. అమ్మవారి జీవిత చరిత్రపై క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు హాసీ, వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. శ్రీ ప్రసన్న వెంకట దాస కోలాట భజనమండలి సభ్యులు ఆలయం వద్ద ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. అమ్మవారికి పల్లకీ సేవ చేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను ఆలయ కమిటీ నిర్వాహకులు వెత్సా వాసు, తీగల నాని, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



తాళ్లపూడిలో వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా పూజలు చేస్తున్న దృశ్యం

పౌష్టికాహారం పంపిణీ

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో నందకిశోర్, భాగ్యలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, గొన్నాబత్తుల రామారావు, కాళ్ల రాంబాబు, పొన్నా సుబ్రహ్మణ్యశర్మ, గోపిరెడ్డి శ్రీనివాస్, గుంటిపల్లి శివకుమార్, కొత్తపల్లి నాగేశ్వరరావు, ముంగండ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు కోసం..

వాడపల్లి వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు

తాళ్లపూడి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు విజయం సాధించాలని ప్రార్థిస్తూ కోనసీమ జిల్లాలోని వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో తాళ్లపూడి మండలం పెద్దేవానికి చెందిన ఆ పార్టీజిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయం సాధించాలని, అలాగే రాజమహేంద్రం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం అభ్యర్థి జక్కంపూడి రాజా, పార్టీ కొవ్వూరు, అనపర్తి, రాజమహేంద్రవరం సిటీ, రూరల్, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల అభ్యర్థులందరూ భారీ మెజారిటీతో విజయం సాధించాలని కోరుతూ వాడపల్లి వెంకన్నకు పూజలు చేశారు. అనంతరం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాను రాజమహేంద్రవరంలోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి ప్రసాదం అందజేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కొవ్వూరు ఏఎంసీ డైరెక్టర్ సుంకర రంగబాబు, ద్వారకాతిరుమల దేవస్థానం పాలకమండలి సభ్యుడు చిట్టూరి అన్నవరం, పార్టీ పెద్దేవం గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతా వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాను సత్కరిస్తున్న తోట రామకృష్ణ తదితరులు

వ్యవసాయ వ్యర్థాలతో కంపోస్టు తయారీ

వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త సీహెచ్ శ్రీనివాస్



సాగు వ్యర్థాలతో కంపోస్టు తయారీ విధానాన్ని రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు, విద్యార్థులు

కొవ్వూరు: డీ కంపోజ్ ద్వారా వరి ఎండుగడ్డిని పొలంలోనే కుళ్లబెట్టి, సేంద్రియ ఎరువుగా మార్చుకుంటే పంటలకు లాభదాయమని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త (భూసార విభాగం) డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ సూచించారు. ఆ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మండలంలోని దొమ్మేరు గ్రామంలో రెండు రోజులుగా సేవా శిబిరం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ శిబిరంలో భాగంగా శనివారం వారు వరి గడ్డిని కుళ్లబెట్టుకుని సేంద్రియ ఎరువుగా మార్చే విధానాన్ని దొమ్మేరు గ్రామ రైతులకు డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. వరి గడ్డిని పొలంలో తగలబెట్టే బదులు కుళ్లబెట్టి సేంద్రియ ఎరువుగా ఎలా మార్చుకోవాలో రైతులకు అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులు పొలాలకు వెళ్లి మట్టి నమూనాలను సేకరించారు. పొలంలో దొరికే పశువుల పేడ, కూరగాయల వ్యర్థాలు, వ్యవసాయ వ్యర్థాలు, ఎండు ఆకులు, కర్రలు, బెరడులను వేగంగా కుళ్లబెడితే కంపోస్టు ఎరువు తయారవుతుందన్నారు. ఈ కంపోస్టు ఎరువు నేలలో నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలను మొక్కలకు అందించడానికి దోహదపడుతుందని డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ కె.దక్షిణా మూర్తి, డాక్టర్ సీహెచ్ సునీత, వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ టి.ఉషా రాణి, డి.శేఖర్‌లతో పాటు విద్యార్థులు కూడా పాల్గొన్నారు.

కమనీయం .. శ్రీనివాసుని కల్యాణం



కల్యాణ వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారు

- కనులారా వీక్షించిన భక్త జనం
- దేవరపల్లిలో ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు, పురోహితులు

దేవరపల్లి: స్థానికంగా కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ వేడుకలు కనుల పండువగా జరిగాయి. శ్రీవారి ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం రాత్రి 7.30 గంటలకు ప్రారంభమైన కల్యాణం రాత్రి 11.30 గంటల వరకూ నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను పెండ్లి కుమార్తెలు గాను, శ్రీవారిని పెండ్లి కుమారుడిగాను అలంకరించిన పురోహితులు, వేద పండితులు కల్యాణ వేదికపైకి తోడ్కొని వచ్చారు. గోవింద నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆలయ కమిటీ ద్వారా పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాస్ దంపతులు అందజేశారు. కల్యాణం అనంతరం భక్తులకు కల్యాణ అక్షితలు, ప్రసాదాలు అందజేశారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని కనులారా వీక్షించారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 15 నుంచి 18 వరకూ వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీవారి రథోత్సవం, సాయంత్రం డోలోత్సవం జరిగాయి. టీటీడీ దేవస్థానం కళాకారుడు కె. సరస్వతీ ప్రసాద్ బృందం ఆలపించిన అన్నమాచార్య సంకీర్తన స్వరాభిషేకం భక్తులను ఆకట్టుకుంది.

శాఖా గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరం

నల్లజర్ల: ఈ నెల 15 నుంచి జూన్ 7 వరకూ నల్లజర్ల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు గ్రంథ పాలకురాలు ఏవీ రమణ తెలిపారు. 10 నుంచి 15 సంవత్సరాల మధ్య వయసు విద్యార్థులందరూ ఈ శిబిరంలో పాల్గొనవచ్చన్నారు. వీరందరికీ వివిధ రకాల కృత్యాలతో పాటు క్యారమ్స్, చెస్, క్విజ్, క్రాఫ్ట్ మేకింగ్, డ్రాయింగ్, పుస్తక పఠనం తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. వేసవి సెలవులకు అమ్మమ్మ, తాతయ్య ఇళ్లకు వచ్చిన విద్యార్థులు కూడ ఈ శిబిరంలో పాల్గొనవచ్చన్నారు.



నల్లజర్ల లైబ్రరీలో బాలలతో ఆటలాడిస్తున్న గ్రంథ పాలకురాలు ఏవీ రమణ

చాగల్లులో..

చాగల్లు: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా చాగల్లు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శనివారం పలు అంశాలు నేర్పించారు. గ్రంథాలయాధికారి గద్దె శ్రీనివాసరావు వారికి నీతి కథలు చెప్పారు. చదరంగం ఆడించడమే గాకుండా పుస్తక పఠనం, పుస్తక సమీక్ష చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ వేసవి విజ్ఞాన శిబిరం జూన్ 7 వరకూ కొనసాగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

విశ్రాంత డీఎల్‌పీవో సత్యనారాయణకు నేడు సన్మానం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాకు తొలి జిల్లా గ్రామ పంచాయతీ అధికారిగా బాధ్యతలు నిర్వహించి, గత నెల 30వ తేదీన నరసాపురం డీఎల్‌పీవోగా పదవీ విరమణ చేసిన జాన సత్యనారాయణకు ఆదివారం బొమ్మూరులోని చెరుకూరి కన్వెన్షన్‌లో ఆత్మీయ అభినందన సన్మాన సభనునిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ విస్తరణాధికారుల సంఘం, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. విశిష్ట అతిథిగా కలెక్టర్ కె.మాధవీలత, ప్రత్యేక అతిథిగా జిల్లా గ్రామపంచాయతీ అధికారి దాసరి రాంబాబు పాల్గొంటారు.